# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశాభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి వాజ్ పేయీకి ఉన్న అంకితభావం స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు.**
2. **గౌతు లచ్చన్న జయంతి ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **నెల్లూరు నగరంలోని నగరపాలక సంస్థ పాఠశాలలను పి 4 కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తామని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**
4. **స్వయం సాధికారిత కింద విజయనగరం జిల్లా గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలు ఆత్మనిర్భర్ భారత్ సంఘటన్ పురస్కారాలు అందుకున్నాయి.**
5. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది.**

==========================

దేశాభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి వాజ్ పేయీకి ఉన్న అంకితభావం స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. వాజ్ పేయీ వర్ధంతి సందర్భంగా ఈరోజు ఢిల్లీలో ఆయన సమాధి వద్ద ప్రధానమంత్రి నివాళులర్పించారు.

మరోవైపు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వాజ్ పేయీ కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వాజ్ పేయీ అందించిన సహకారాన్ని తెలుగు జాతి ఎప్పటికీ మర్చిపోదని పేర్కొన్నారు.

--------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు గౌతు లచ్చన్న జయంతి ఈరోజు. 1909 ఆగస్టు 16 వ తేదీన శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలో ఆయన జన్మించారు. రైతులు, ఓటు హక్కు లేని ప్రజల కోసం ఆయన పని చేశారు. గౌతు లచ్చన్న 21 సంవత్సరాల వయస్సులో పలాసలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు అయ్యారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటలకు గాను ఆయనకు సర్దార్ బిరుదు లభించింది. గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19వ తేదీన విశాఖపట్నంలో తుది శ్వాస విడిచారు.

--------------------------

గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు నివాళులర్పించారు. అణగారిన వర్గాల తరపున ఆయన చేసిన పోరాటాలు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరో వైపు చిత్తూరు, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో గౌత లచ్చన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు.

-----------------------------

నెల్లూరు నగరంలోని నగరపాలక సంస్థ పాఠశాలలను పి 4 కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ నగరపాలక సంస్థ పాఠశాలలను ఆయన ఈరోజు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విద్యా విధానం మేరకు నర్సరీ నుంచి ప్లస్ టూ వరకూ ఒకే పాఠశాలలో చదివేలా వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వివరిస్తూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------------

శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తమ సందేశాలు తెలియజేశారు. విశ్వాసం, ఆనందం, ఉత్సాహంతో కూడిన ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త శక్తి, ఉత్సాహాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్మ మార్గాన్ని అనుసరించడం ద్వారా అంతిమ సత్యాన్ని సాధించడం గురించి శ్రీ కృష్ణుడు మానవాళికి తెలియజేశాడని తెలిపారు.

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈరోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతిలోని ఇస్కాన్ ఆలయంలో, శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో, ఎన్టీఆర్ జిల్లాలో భక్తులు శ్రీకృష్ణ సంకీర్తనలతో వాసుదేవుడి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

-----------------------------

ఉత్తమ మండల సమాఖ్య పరిధిలో స్వయం సాధికారిత కింద విజయనగరం జిల్లా గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలు ఆత్మనిర్భర్ భారత్ సంఘటన్ పురస్కారాలు అందుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం దేశరాజధాని దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు ఈ సమాఖ్యలకు పురస్కారాలు ప్రకటించారు.

-----------------------------

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో 'పుస్తక మహోత్సవం' కార్యక్రమం

నిన్న ప్రారంభమైంది. విజయవాడ బుక్ ఫెస్ట్, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఏపీ గ్రంథాలయ పరిషత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శనను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గొప్ప రచయితల అందించిన సాహిత్యం, స్ఫూర్తి ప్రదాతల జీవిత చరిత్రలు, భాష ప్రాధాన్యత తదితర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడిస్తూ..

– వాయిస్.. 27 సెకను

---------------------------

విశాఖపట్నంలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ –ఏపీ ఎల్ సీజన్–4 క్రికెట్ పోటీల్లో నిన్న రాయల్స్ ఆఫ్ రాయలసీమ, సింహాద్రి వైజాగ్ లయన్స్  మధ్య మ్యాచ్ జరిగింది. వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు.

మరోవైపు గత రాత్రి తుంగభద్ర వారియర్స్ , భీమవరం బుల్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో తుంగభద్ర వారియర్స్ 13 పరుగుల తేడాతో గెలిచింది. ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషాలకు అమరావతి రాయల్స్,  సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్ల మధ్య ఈ రాత్రికి తుంగభద్ర వారియర్స్, కాకినాడ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువకులను మత్తు పదార్థాల నుంచి దూరం చేయడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్ జనరల్ అనురాగ్ గార్గ్ తెలిపారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల రహిత కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ..

–వాయిస్.. 27 సెకన్లు

---------------------------

గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్, ఎన్నారై కోటాలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ ను పరిశీలించాలని సూచించారు.

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్రప్రదేశ్ ప్రాంతాలలో అల్పపీడనానికి అనుబంధంగా  ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి  ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్  ..16 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం “క్యాచ్ ది రైన్” అనే కార్యక్రమాన్ని చేపట్టింది. “ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం” అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

======================